పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్


వినుకొండవారితోటలో రూ.34లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పట్టణ సుందరీకరణపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వినుకొండవారితోటలో రూ.34 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ పనులకు బుధవారం ఎమ్మెల్సీ శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పట్టణంలోనిడ్రెయిన్‌లు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సుమారు రూ.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ప్రతీ వార్డులోనూ రోడ్లు, డ్రెయిన్‌ల పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధుల్లో ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్సీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ నిధులతో ఆయా సచివాలయాల్లోని ప్రాధాన్యత పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షుడు చందక సత్తిబాబు, సచివాలయ కన్వీనర్ ఎంఎస్ వాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ నాయకులు గుణ్ణం సర్వారావు, గుణ్ణం సురేష్, రామాంజుల పెదమధు, ఖండవల్లి వాసు, చినిమిల్లి గణపతిరావు, కొరగంజల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం

యలమంచిలి: మట్లపాలెం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు కడలి జపన్యా మూడేళ్ల క్రితం కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. ఆ సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ కరోన వ్యాధిగ్రస్తులతో నిండిపోవడంతో ఆరోగ్యశ్రీ ఉన్న ఆసుపత్రిలో వైద్యం అందలేదు. దీంతో బాలుడి తండ్రి నరేష్ బాబు అప్పు చేసి ఆ డబ్బుతో కుమారుడికి వైద్యం చేయించాడు. కరోనా ఉధృతి తగ్గిన తరువాత ముఖ్యమంత్రి సహాయనిధికి అర్జీ పెట్టుకున్నాడు. అయితే వైద్యం చేయించుకుని మూడు నెలలు గడచిపోవడంతో టెక్నికల్‌గా సమస్యల వల్ల ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఆలస్యమైంది. ఈ విషయాన్ని గ్రామ పెద్దలు చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య), కడలి నరసింహస్వామిలు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ద్వారా తెలుసుకున్న కవురు శ్రీనివాస్ బుధవారం బాలుడికి రూ.50 వేలు నగదు అందజేశారు. వారం రోజుల్లో మరొక రూ.50 వేలు ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా లక్ష్మి, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లు మాధవరావు, కోరం లలిత, కొల్లాటి పెద్దిరాజు, పేరిచర్ల వెంకట నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన


పెనుగొండ నాడు పుంత జగనన్న కాలనీలో రహదారి పూడిక పనులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


సిద్ధాంతంలో మురుగు బోదే పనులు పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండ నాడు పుంత జగనన్న కాలనీ రహదారి పూడిక పనులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరిశీలించారు. కాలనీ రహదారి ఇబ్బందులు ఉండడంతో రహదారి పూడిక పనులు సత్వరం ప్రారంభించాలని గతవారం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆదేశాలు జారీ చేశారు. దీంతో రెండు రోజులుగా రహదారి పూడిక పనులు ప్రారంభించారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాలు సైతం ఏర్పాటు చేయడం పూర్తి కావడంతో రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయడం వల్ల గృహనిర్మాణం జరుగుతుందని అధికారులకు పూడిక పనులకు ఆదేశాలు జారీ చేశారు. కొంతమేర పూర్తి కావడంతో బుధవారం పరిశీలించి వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), నడిపూడి ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీను, పెనుగొండ పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్, కుడుపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మురుగు బోదే పనులు వేగంగావంతం

సిద్ధాంతం గరగాలమ్మ డ్రయిన్ పనులు వేగంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధ వారం సాయంత్రం డ్రెయినేజీ పనులు పరిశీలించారు. వర్షాలు ప్రారంభం కానుండడంతో వేగంగా పనులు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సర్వే నిర్వహించి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నం ఏడుకొండలు, సుతాపల్లి సత్తిబాబు, చింతపల్లి ప్రసాద్, కేశవరపు గణపతి, పూరిళ్ల శ్రీను, మాకా సామ్యేలు, వీఆర్‌ఓ ఏసుబాబు పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో సమయస్ఫూర్తి అవసరం


దొడ్డిపట్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ పింటు నంది

యలమంచిలి: వరదలు, తుఫాన్‌లు, అగ్నిప్రమాదాలు, భూకంపం వంటి ప్రకృతి విపత్తుల సమయంలోను రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ పింటు నంది కోరారు. విపత్తుల సమయంలో మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు, ఇతరులను కూడా ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ బుధవారం దొడ్డిపట్ల హైస్కూల్లో జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. లంక గ్రామాల్లో విరివిగా దొరికే ఎండు కొబ్బరికాయలు, ఖాళీ వాటర్‌బాటిల్స్‌తో లైఫ్ జాకెట్స్ ఏ విధంగా తయారుచేయాలో వివరించారు. నీటిలో మునిగిన వ్యక్తికి ఏ విధంగా ప్రథమ చికిత్స చేయాలో చూపించారు. గ్యాస్ బండ లీకైతే ఏ విధంగా అరికట్టవచ్చునో మహిళలకు వివరించి, అనంతరం మహిళలతో లీకయిన గ్యాస్ బండను ఆర్పించారు. ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది 13 మంది, అగ్ని ప్రమాద అధికారులు ఆరుగురు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు వీఆర్వో కాకితాపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కేపీ పాలెంలో ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు

ప్రకృతి వైపరీత్యాల అవగాహన

మొగల్తూరు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం కేపీ పాలెం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ కమాండర్ పింటూ నంది ఆధ్వర్యంలో విద్యార్థులకు, గ్రామస్తులకు రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.అనితాకుమారి, ఆర్ఐ శిరీష, వ్యవసాయాధికారి రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

జాన్‌లియో సేవలు అభినందనీయం


డాక్టర్ జాన్‌లియోను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: స్థానిక వీవర్స్ కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండేళ్లగా పనిచేసి ఇటీవల దొడ్డిపట్ల పీహెచ్‌సీకి బదిలీ అయిన వైద్యాధికారి డాక్టర్ జాన్ లియోకు వైద్య సిబ్బంది సన్మానం చేశారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది మాట్లాడుతూ జాన్ లియో నిత్యం ప్రజల ఆరోగ్య సమస్యలపై ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వైద్యసేవలందించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణంలో ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, డీపీఎంఓ రామ్ ప్రసాద్, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, హెచ్‌వీ అన్నమణి, బాబీ, ప్రియా, మీనాక్షి, భవానీ, నాగమణి పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 13న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరరావు కోరారు. ఓఏఎస్(ఆఫీస్ అసిస్టెంట్) ఎంఎల్‌టీ(మెడికల్ లాబ్ టెక్నీషియన్) టైపు, షార్ట్‌హేండ్, బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్‌లు బోధించేందుకు గాను జులై 13న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైపు, షార్ట్‌హ్యాండ్ పోస్టులకు బీకాం 50 శాతం మార్కులతో పాస్ అయిన అభ్యర్థులు, బయో కెమిస్ట్రీ బోధించేందుకు 50 శాతం మార్కులతో ఎంఎస్సీ అర్హత , లేక ఎమ్మెస్సీ మైక్రోబయాలజీలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఇంగ్లీషు షార్ట్‌హేండ్ హయ్యర్ గ్రేడ్ ఇంగ్లీషు టైపు హయ్యర్ గ్రేడ్, అర్హత ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 13న ఉదయం 11 గంటలకు దరఖాస్తు, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

రీ సర్వే వెరిఫికేషన్ పై గ్రామసభ


జక్కరంలో గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామాల్లో రీ సర్వే మొదటిదశ ప్రక్రియ పూర్తైన చోట గ్రామస్తులు, భూహక్కుదారులతో గ్రామసభలు నిర్వహించాలని వచ్చిన ఆదేశాల మేరకు కాళ్ల మండలం జక్కరం గ్రామంలో భూ రీసర్వే వెరిఫికేషన్ పై బుధవారం కాళ్ల తహసీల్దార్ కృష్ణారావు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రీ సర్వేలో భూమి హద్దులు, విస్తీర్ణం, పాత సర్వేనెంబర్ వివరాలను రైతులకు వివరించారు. వీటిపై ఎటువంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి వీఆర్వో సుధాకర్ పాల్గొన్నారు.

వరినాట్లలో బెంగాలీ పురుషులదే హవా


పెనుమంట్రలో వరినాట్లు వేస్తున్న బెంగాలీలు

పెనుమంట్ర: ఒకప్పుడు వరినాట్లు వేయాలంటే మహిళలకే చెల్లుబాటయ్యేది. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వచ్చినా వరినాట్లు మాత్రం కూలీలు వేయాల్సిన పరిస్థితి నేటికి కొనసాగుతుంది. వ్యవసాయ రంగంలో కూలీల కొరత అధికంగా ఉండడంతో వరినాట్ల సమయంలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఆకుతీత మగవారు చేస్తే నాట్లు మాత్రం మహిళలే వేయాల్సి వచ్చేది. కొన్ని కుటుంబాల్లో మెరుగుపడిన ఆర్థిక పరిస్థితి కారణంతో కొందరు మహిళలు వ్యవసాయ పనులకు దూరంగా ఉండడంతో వరినాట్ల సమయంలో కూలీల కొరత మరింత జఠిలం అవుతుంది. ఈ పరిస్థితిలో ఈ ప్రాంత రైతులకు బెంగాలీ మగ కూలీలు రైతులకు వరంగా మారారు. ఇప్పుడున్న రేట్ల ప్రకారం ఎకరం పొలంలో మహిళలు నాట్లు వేయాలంటే రూ.5 వేలు ఖర్చు అవుతుంది. అదే మగ కూలీలు అయితే ఆకు తీతతో రూ.3800తో వరినాట్లను పూర్తి చేస్తున్నారు. బెంగాలీలు 17 నుంచి 20 రోజులు పూర్తయిన వరిని మాత్రమే నాట్లుగా వేసే పరిస్థితి ఉండగా అదే మహిళలు వేయాలంటే 25 నుంచి 30 రోజులు నారు తయారీ కావాల్సి ఉంది. బెంగాలీలు లైనుగా నాట్లు వేయడం వల్ల వరిలో గాలి, వెలుతురు సక్రమంగా ఉండి చీడ, పీడలు ఇబ్బందులు కూడా రైతులకు తక్కువగా ఉండడమేగాకుండా వరి తక్కువ సమయంలో నాట్లు వేయడం వల్ల పిలకలు తొడిగి ఎక్కువ దుబ్బు చేయడం వల్ల దిగుబడిలో కూడా తేడా వస్తుంది. దీంతో వ్యవసాయ శాస్త్ర వేత్తలతో పాటు అధికారులు కూడా బెంగాలీ కూలీలతో నాట్లు వేయించుకోవాలని సూచిస్తున్నారు. మండలంలో 12,200 ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉండగా రెండు రోజులుగా వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. సుమారు 300 ఎకరాల్లో వరినాట్లను బెంగాలీ కూలీలే వేశారు. మండలంలో వరినాట్లు ముమ్మరంగా ప్రారంభైనట్లు మండల వ్యవసాయాధికారిణి అడబాల జోసిల తెలిపారు.

అవసరాల కోసమే స్థలాల సేకరణ


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం: పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అవసరాల నిమిత్తం ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా రహదారి విస్తరణ కోసం కె.ఎన్.రోడ్‌లో స్థలాలను సేకరించి, అవి ఇచ్చిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చామని కమిషనర్ ఏ.శామ్యూల్ బుధవారం ఆయన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. కెఎన్‌రోడ్డును మాస్టర్‌ప్లాను 100 అడుగులు రోడ్డుగా డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ 1988 సంవత్సరంలో ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు 80 అడుగులు మాత్రమే ఉందన్నారు. దీంతో రెండు పక్కల పదేసి అడుగుల వంతున స్థలాలను తీసుకోవాల్సి ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబరు 119, జీఓ నంబరు 180, జీఓ 179 ప్రకారం రోడ్డు విస్తరణ దృష్ట్యా తొమ్మిది మంది దగ్గర నుంచి స్థలాలను తీసుకొని, ఆయా స్థలాలను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పురపాలక సంఘానికి రిజిస్టర్ చేయించి , ఆ స్థలానికి మార్కింగ్ చేసిన తర్వాత టీడీఎస్ బాండ్లు ఇచ్చామన్నారు. పెంటపాడు నుంచి పోలీసు ఐలాండ్ వైపునకు మూడు స్థలాలు, కుడి పక్కన ఆరు స్థలాలను తీసుకొని టీడీఆర్ బాండ్లు ఇచ్చామని, ఈ స్థలాలు మునిసిపాలిటీ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. ఈ స్థలాలలో నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగ అధికారులను ఆదేశించామన్నారు. ఒక థియేటర్‌కు సంబంధించి ప్రహరీగోడను తొలగించాల్సి ఉందని, అది తొలగించుకోడానికి స్థలయజమాని 15 రోజులు సమయం అడిగారన్నారు. ఈ బాండ్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరుగలేదన్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రణాళిక అధికారి హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కారంతో మాట్లాడడం మేలు


వలంటీర్లకు సన్మానం చేస్తున్న యడ్ల తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: గత ప్రభుత్వంలో ఏ పథకం కావాలన్నా లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవారని నేడు ఆ పరిస్థితి లేకుండా నేరుగా లబ్ధిదారుని ఇంటికే వలంటీర్ ద్వారా పథకాలు అందిస్తున్నారని ఇలా సేవలందించే వలంటీర్లపై జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ విమర్శలు చేయడం దారుణమని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. బుధవారం తాతాజీ తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటికో ఉద్యోగం కలిస్తానని చెప్పిన చంద్రబాబు యువతను పట్టించుకోలేనప్పుడు ఏం చేశారు? అని ప్రశ్నించారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గౌరవ వేతనం ఇస్తూ వలంటీర్ వ్యవస్థను ఎంపిక చేసి ప్రజలకు అన్ని పథకాలు ఇంటికి చేరవేస్తుంటే మీకు చులకనగా ఉందా? అని దుయ్యబట్టారు. ప్రతీ కుటుంబానికి అండగా ఉంటానని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన వలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి ఒక్కో కుటుంబానికి వలంటీర్ రూపంలో జగన్‌మోహన్ రెడ్డి ఆ ఇంటి కుటుంబ సభ్యునిగా ప్రజలకు అండగా ఉంటున్నారన్నారు. సినీ రంగం నుండి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన ఎన్టీఆర్, చిరంజీవిలు ఎప్పుడూ ఇంత దిగజారి మాట్లాడలేదన్నారు. పవన్ కల్యాణ్ కొద్దిగ సంస్కారంతో మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. కాపులంటే పడని రఘురామకృష్ణంరాజు, గతంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన నాయకుడి కుమారుడు నాదెండ్ల మనోహర్‌లు ఇలాంటి వాళ్లు వెనుకుంటే ఇలాంటి మాటలే వస్తాయన్నారు. మనం మంచి చేయాలంటే మంచి విలువలున్న నాయకులు పక్కన ఉంటే మంచి మాటలు వస్తాయని మంచి పనులు చేస్తామని ఇలా వెన్నుపోటులు పొడిచే నాయకులు వెనకుంటే ఇలాంటి దిగజారుడు విమర్శలే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజి, పాలపర్తి కృపానాథ్, రేలంగి శ్రీను, కాపిశెట్టి శ్రీను, పిల్లా శ్రీనివాస్, ఉనికెల రాముడు, డేవిడ్ రాజ్, పిల్లా అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీరంగనాథరాజు సహకారంతో అభివృద్ధి


ఆచంట వేమవరంలో రహదారిని నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి తెలిపారు. బుధవారం ఆచంట వేమవరం గాంధీ బొమ్మ ఎదురుగా సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో మరిన్ని పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండేటి సురేష్ బాబు, రాష్ట్ర వీవర్స్ కార్పోరేసస్ డైరక్టరు అందే నాగబసవన్న, ఎంపీటీసీ సభ్యుడు గుడాల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి చికిత్స


కంటి చికిత్స అనంతరం మందులు అందజేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని బల్లిపాడు గ్రామానికి చెందిన మాచవరపు చినసీతకు వాకర్స్ క్లబ్ సభ్యులు కంటి చికిత్స చేయించారు. బుధవారం క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ చినసీత కంటి పరీక్షకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వడంతో సమస్యను తమ క్లబ్ దృష్టికి తీసుకువచ్చారన్నారు. స్థానికంగా ఉన్న ఓ కంటి ఆసుపత్రిలో అమెకి రూ. 9 వేలతో కంటి శస్త్ర చికిత్స చేయించి అవసరమైన మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఫీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి, శేరేపాలెం సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న గ్రామ సభలు నిర్వహించనున్నారు. ముత్యాలపల్లి సచివాలయ పరిధిలో తహసీల్దార్ జి.అనితా కుమారి, శేరేపాలెం సచివాలయ పరిధిలో ఎంపీడీఓ వి.బాబ్జిరాజు పర్యవేక్షణలో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

లంకలకోడేరులో

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉదయం 11గంటలకు జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

వైభవంగా దుర్గమ్మ జాతర


పెనుమంట్రలో జాతర నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో రాజీవ్ కాలనీలో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారి జాతర మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని రథంపై మేళ తాళాలతో ఊరేగించారు. గరగ నృత్యాలు, బేతాళ నృత్యాలతో బాణసంచా కాలుస్తూ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు చాకలిచెరువు, జయంతి కాలనీలో బుధవారం ఫీవర్ సర్వే, మస్కిటో లార్వా, డెన్సిటీ, డెంగ్యూ నివారణ మాసోత్సవం వంటి కార్యక్రమాలపై ప్రజానీకానికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యాధుల నివారణకు ప్రతిరోజు తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఫీవర్ సర్వే చేస్తున్న సమయాల్లో వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ కె.పృథ్వీరాజ్, వార్డు హెల్త్ సెక్రటరీ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవాతత్పరులు

కష్టమైనా ఇష్టమే


పెదలంకలో వరదలో రాత్రి సమయంలో ఇంటింటికీ వెళ్లి ఆహారం అందజేస్తున్న వలంటీర్ నీతిపూడి పద్మ

వరదల సమయంలో మా గ్రామంలో ఇళ్ల మధ్యకు గుండెల లోతు వరద నీరు చేరుతుంది. నాలుగేళ్ల నుంచి వరదల సమయంలో నా క్లస్టర్ పరిధనే కాకుండా గ్రామ ప్రజలు అందరికీ అవసరమైన ఆహారం తయారీలో మహిళావలంటీర్స్ అందరూ భాగస్వాములు అవుతున్నాం. పురుష వలంటీర్లు పడవలపై ఆహారాన్ని తీసుకెళ్లి అందరికీ అందజేస్తారు. ఆ సమయంలో పని చేయడం కష్టమైనా ఇష్టంగా చేస్తున్నాం.

– నీతిపూడి పద్మ, వలంటీర్, పెదలంక

సేవ చేసే భాగ్యం కలిగింది..


కనకాయలంకలో వరద నీటిలో ఉన్న బాలికను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న వలంటీర్ గుడిశే రాజీవ్

వరదల సమయంలో గ్రామ ప్రజలందరికీ సేవ చేసే భాగ్యం వలంటీర్లుగా మాకు కలిగింది. వరదల సమయంలో ఇళ్లలో నుంచి బయటకు రావడానికి వృద్ధులు, మహిళలకు చాలా కష్టంగా ఉంటుంది. ఆ సమయంలో వారు అత్యవసరంగా బయటకు వెళ్లాలంటే మాకే ఫోన్ చేస్తారు. కష్టమైన వారి అవసరాలు తీర్చడం మా బాధ్యతగా తీసుకుని వారికి సహాయం చేస్తున్నాం.

– గుడిశే రాజీవ్, వలంటీర్, కనకాయలంక

పవన్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి


చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: పేద వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందిస్తూ సేవాభావంతో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులకు డేటా చేరవేస్తున్నారని వ్యాఖ్యలు చేయడం దారుణమని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లకు పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల వ్యవస్థను దేశమంతా స్వాగతిస్తోందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను ఆయా రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. స్థానికంగా ఉంటూ గౌరవ వేతనం తీసుకుంటూ 50 కుటుంబాలకు సేవలందిస్తున్న వలంటీర్ల పనితీరును తప్పుబట్టిన పవన్ కల్యాణ్ తక్షణం క్షమాపణ చెప్పాలని ఎంపీపీ కనకలక్ష్మి డిమాండ్ చేశారు.